


## జూలై ౨౦౦౯

**కథాసాగర మథనంలో** జులై నెల స్వాతి, ఆంధ్రభూమి, నవ్య వారపత్రికలు, స్వాతి, ఆంధ్రభూమి, విపుల, రచన, చిత్ర మాసపత్రికలు, దినపత్రికలు ఈనాడు, ఆంధ్రజ్యోతి వార్త సాక్షి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభల ఆదివారం అనుబంధాలలో ప్రచురితమైన 92 కథలను విశ్లేషించి ఈ క్రింది కథలను కౌముది మాసపత్రిక పాఠకుల పరిచయానికి ఎంచుకున్నాను.

క్రితం కొన్ని నెలలకు భిన్నంగా ఈనెల కథలు వస్తువైవిధ్యంలోనూ, రచనా సంవిధానంలోనూ ఎంతో ముందడుగు వేశాయి. అందుకే పరిచయం చేసే కథల సంఖ్య కూడా పెరిగింది. మామూలుగా ముసలివాళ్ళను చూడని పిల్లల కథలు, రొటీన్ ప్రేమ కథలు, నీతి కథలు వచ్చినా భిన్నమైన అంశాలను ఎంచుకున్న కథలు, జీవితంలోని పలు విభిన్న పార్శ్వాలు స్పృశించిన కథలు అనేకం ఉన్నాయి.

***<u>నిప్పుల కుంపటి:</u>*** మన కథా ప్రపంచంలో కొన్ని రకమైన కథలకే ప్రాధాన్యం ఉంటుంది. కొన్ని సమస్యలను అదే కోణంలో చూపించే కథలను విమర్శకులు, అంటే ఆ భావజాలాన్ని సమర్ధించేవారు, పొగుడుతారు. దాంతో అలాంటి ఆలోచనలు ప్రామాణికంగా నిలుస్తాయి. కథకులు అదే సమస్యను, అదే కోణంలో ప్రదర్శిస్తారు. అలాంటి కథ నిప్పులకుంపటి. 'సెజ్' ల వల్ల భూములు కోల్పోతూ అన్యాయమైపోతున్న పేదపల్లె ప్రజల దుస్థితిని ప్రదర్శించే కథ ఇది. శ్రీదేవి, రాజయ్యలు ప్రధాన పాత్రలు. వీళ్ళది ఆ ఊళ్ళో గుడి పూజారి పని. కానీ, 'సెజ్'ల కోసమని భూములను ప్రైవేటు పరం చేసి, నష్టపరిహారంగా పేదల చేతుల్లో డబ్బులు పెడతారు. ప్రజలంతా బాధపడుతుంటారు. 'ఆ ఫాక్టరీలేవో పోరంబోకు భూముల్లో పెట్టుకోకూడదు?' అని వాపోతారు. చివరికి రాజయ్య చనిపోతాడు. 'ఇదంతా ఎందుకు జరుగుతూ ఉంది? ఎవరికోసం జరుగుతూ ఉంది?' అని ఎదురు తిరగాలనుకుంటుంది ఆమె.

'ఊరంతా నిప్పుల కుంపటిలా ఉంది' అంటూ కథను ముగిస్తాడు రచయిత సుంకోజు దేవేంద్రాచారి. ఈ కథ పదిహేను జులై 'నవ్య'లో ప్రచురితమయింది. 'సెజ్'లపై ప్రచురితంలో ఉన్న అభిప్రాయాన్ని ఈ కథ వ్యక్తపరుస్తుంది. ఈ అంశంపై ఇలాంటి కథలు బోలెడన్ని వచ్చాయి. ఇంకా బోలెడన్ని వస్తాయి. అయితే ఇక్కడ రచయితలు ఆలోచించవలసిందేమిటంటే, రచయిత ఏదో ఓ దృక్కోణానికి పరిమితమవటం వల్ల వారి దృష్టి సంకుచితమైపోతోంది. 'సెజ్'లనేది ఒక పరిణామ క్రమం. ఒకప్పుడు సినిమాలు వస్తూంటే బుర్ర కథలు, యక్షగానాలు, వీధిభాగోతాలు, నాటకాలు... ఇలా అనేక వినోదాత్మక కళలు ప్రమాదంలో పడ్డాయి. అలాగని సినిమాను వ్యతిరేకిస్తామా? అలాగే, రైళ్ళు బస్సులు, టాక్సీలు రావటం వల్ల రిక్షాలు, ఎడ్లబళ్ళు, ఇతర ప్రయాణ సాధనాల వారు దెబ్బతిన్నారు. అలాగని రైళ్ళను ఇతర ఆధునిక సాంకేతిక ప్రగతి ప్రతీకలను అనవసరమంటామా? వీధులు ఊడ్చే మెషీన్లు వచ్చి అనేకులు పొట్టకొట్టాయి. అంతెందుకు, 'ఐటి' వచ్చి ఎంతెంతమంది జీవితాలను అతలాకుతలం చేసింది? కాబట్టి, రచయితలు తమ దృష్టిని కేవలం వర్తమానానికే పరిమితం చేయకూడదు. వారు దూరదృష్టిని ప్రదర్శించాలి. ఆవేశం ప్రదర్శించి సంతృప్తి పడకూడదు. ఆలోచనను జత చేయాలి. అనివార్యమైన మార్పు పట్ల ఆవేదన, ఆవేశం సామాన్యులు ప్రదర్శిస్తారు. రచయిత అన్నవాడు ద్రష్టలాంటివాడు.

మార్పులను వివరించి, ఆ మార్పులను తట్టుకుని, అర్ధం చేసుకునే శక్తి ప్రజలకిస్తూ, వారిని భవిష్యత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం చేయాలి. రచయితలు ఆశావాదాన్ని ప్రదర్శించాలి. కృష్ణానదికి ఆనకట్ట కట్టడం వల్ల ఊళ్ళు మునిగిపోతాయని ఆగిపోయివుంటే, ఈనాడు శ్రీశైలం ప్రాజెక్టు ఉండేదా? ఇన్ని గ్రామాలలో విద్యుద్దీపాలు వెలిగేవా? ప్రతీదానికీ బొమ్మ, బొరుసు ఉంటాయి. నాణేనికి ఓ వైపును మాత్రమే చూసేవారు సామాన్యులు. రెండు వైపుల చూసి, ప్రజలకు నిజానిజాలు వివరించేవాడు, భవిష్యత్తును దర్శింపచేసేవాడు సృజనాత్మక రచయిత. ఈ సందర్భంలో అప్రస్తుతమైనా 'నయాదౌర్' అన్న పాత హిందీ సినిమాలెన్నో ఎవరికీ గుర్తులేవు. కానీ 'సమన్వయా'న్ని ప్రదర్శించిన ఆ సినిమా ఈ నాటికీ సజీవంగా ఉంది. ఆధునికతను, ఉన్నదాన్ని ఉన్నట్టుంచాలనే ఆలోచనకు నడుమ ఘర్షణ తలెత్తినప్పుడల్లా 'నేనున్నా'నంటూ మార్గదర్శనం చేస్తుంది. రచయితలు అలాంటి ఆలోచనకు పెద్ద పీట వేస్తే తెలుగు కథలు కూడా చిరంజీవులవుతాయి. లేకపోతే, ఆ భావజాలానికి పెద్ద పీటవేసేవారికి గొంతున్నంతకాలం ఉంటాయి. ఆ తరువాత ఎవరూ పట్టించుకోరు.

***లాస్ట్ మెయిల్:*** జూలై 22 'నవ్య'లో ప్రచురితమయిన ఈ కథను రచించింది సీతారత్నం. 'పింక్ స్లిప్'ల ఆధారంగా ఇంతవరకూ వచ్చిన కథలన్నిటిలోకీ నిజానికి దగ్గరగా ఉంటూ, ఆశావాదాన్ని ప్రదర్శిస్తూ, మధ్యలో దారితప్పకుండా, చివరి వరకూ కథపై దృష్టిని, పట్టును సడలనివ్వని కథ ఇది. 'మిత్ర' అనే యువకుడికి 'ఐటి' దెబ్బ తగులుతుంది. ఉద్యోగం పోతుంది. అయినా అధైర్యపడడు. 'ఐటి' రిక్రూటర్‌ను సంప్రతిస్తాడు. తక్కువ జీతమైనా మరో ఉద్యోగంలో చేరిపోతాడు. జీతం తక్కువని బాధపడడు. తక్కువ జీతమైనా ఉద్యోగంలోని లాభాలవైపే దృష్టిపెడతాడు. కొసమెరుపేమిటంటే, మిత్రకు ఉద్యోగం ఇప్పించిన ఐటి రిక్రూటర్ మదన్ ఉద్యోగం పోతుంది.

***సంకెళ్ళు:*** జులై 3, స్వాతి వారపత్రికలో ప్రచురితమయిందీ కథ. ఇది విలక్షణమయిన కథ. నేరస్తుడిలోని మంచితనాన్ని చూపిస్తుందీ కథ. క్షణిక ఆవేశంలోనో తప్పనిసరి పరిస్థితులలోనో శౌర్యం ప్రదర్శించినా, వ్యక్తిపై నేరస్తుడిగా ముద్రపడుతుందేమో కానీ, అలాగే మౌలిక స్వభావం మారదని ప్రదర్శిస్తుందీ కథ. రాఘవరావు, చౌదరి అనే అతడిని హత్య చేస్తాడు. అతడిని కోర్టును తీసుకెళ్ళటం ఓ పోలీసు బాధ్యత. కథ పోలీసు దృక్కోణంలో చెప్పినట్టుంటుంది. అది కథకు వన్నె తెచ్చింది. సాధారణంగా నేరస్తుడంటే ఉండే అనుమానాలు, భయాలు, జాగ్రత్తలను పాఠకులకు తెలిపి, కథలో ఆసక్తి కలిగించే వీలు చిక్కింది. కోర్టు విచారణ వాయిదా పడిన తరువాత కూతురి కోసం ఎదురు చూస్తాడు రాఘవరావు. కూతురి కోసం సంకెళ్ళు తీసేయమంటాడు. అనుమానించినా అతడిమాట వింటాడు పోలీసు. కూతురిపై అతడు ప్రేమ చూపటం చూసిన పోలీసును 'బ్రతికినంతకాలం బంధించి ఉంచే సంసార సాగరం కంటే పెద్ద జైలు ఎక్కడుంది? ' అన్న ఆలోచన వస్తుంది. ఇదీ కథ. అయితే, కూతురు వస్తోంది సంకెళ్ళు తీయమనటం 'రాక్' అనే హాలీవుడ్ సినిమాలో చూసిన గుర్తు. అయినా కథకీ దానికీ ఏ మాత్రం సంబంధం లేదు.

***మంచిరోజు:*** ఆంధ్రభూమి వారపత్రిక, జూలై పదహారు సంచికలో ప్రచురితమయిందీ కథ. కథను రచించింది గన్నవరపు నరసింహమూర్తి. ఈ కథ మామూలు కథనే కానీ రచయిత కథలో ప్రదర్శించిన ఆరోగ్యకర దృక్కోణం అభినందనీయం. దివాకర్, జానకిలకు కొత్తగా పెళ్ళవుతుంది. రైల్వే కాలనీలో ఉండాలన్న జానకి కల నెరవేరుతుంది. కానీ పెళ్ళిరోజు పుట్టింటికి వెళ్ళాలన్న ఆమె కోరిక దివాకరుకు ఉద్యోగంలో అర్జంటు పని రావడం వల్ల భగ్నమవుతుంది. రైలును ఏక్సిడెంటునుంచి తప్పిస్తాడు దివాకర్. రెండో పెళ్ళిరోజు కూడా ఇలానే అవాంతరం వస్తుంది. దివాకర్ ఆమెకి 'సారీ' చెపుతాడు. కానీ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఇతరుల ప్రాణాలు కాపాడుతున్న భర్తను అర్ధం చేసుకుంటుందామె. ప్రతి చిన్న పనికీ అసంతృప్తి పెంచుకుని, భర్తని వదిలేయటమే అభ్యుదయం, అద్భుతం అని బోధిస్తున్న 'పొలిటికల్లీ కరెక్ట్' కథల మధ్య 'మంచి' చెపుతూ, భర్తని అర్ధం చేసుకోమని చెప్పే, మామూలు కథ కూడా గొప్పగా కనిపిస్తుంది.

*నిస్వార్థంగా జీవించాలి ఇట్లు డబ్బు:* పెందుర్తి మాష్టర్జీ రచించిన ఈ కథ జూలై పన్నెండు 'సాక్షి' ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. నిజానికి దీన్ని కథ అనేకన్నా డైలాగులతో కూడిన వ్యాసం అనవచ్చు. ద్వైన్యాస్థానంలో అవివాహితగా గర్భవతి అయిన అంజలి పై న్యాయవిచారణ జరుగుతుంటుంది. దోషి ఎవరంటే? ప్రేమ, కామంలను దాటి 'డబ్బు' దగ్గర ఆగుతుంది. డబ్బు ఓ ఉపన్యాసం ఇస్తుంది. అదీ కథ. కథ మామూలే అయినా రచయిత కథను చిన్న పిల్లల జానపదగాథలా చెప్పాలని ప్రయత్నించటం బాగుంది.

*దృశ్యకీచకం:* కొండేపూడి నిర్మల రచించిన ఈ కథ జూలై పన్నెండు, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయింది. ఈ కథలో రచయిత్రి 'చాటింగ్' ప్రాజెక్టుల 'ఇంటర్వ్యూ'లలోని లైంగిక వేధింపులను ప్రదర్శించాలని ప్రయత్నించారు. ప్రస్ను అనే అమ్మాయి ఓ కార్పోరేటు సెక్టరులో ఉద్యోగం చేస్తుంటుంది.

ప్రాజెక్ట్ కోసం ఒకడితో చాటింగ్ మొదలుపెడుతుంది. వాడు ఆమెతో వెకిలిగా ప్రవర్తిస్తుంటాడు. వాడిని తిట్టుకుంటూ, అసహ్యించుకుంటూ కూడా ఆమెకు వాడితో కాంటాక్టు మెయిన్‌టైన్ చేయక తప్పదు. ఇదీకథ. కథలో ప్రస్ను పాత్రకానీ ఆమె బాధని కానీ పాఠకుల సానుభూతి పొందే రీతిలో రూపొందలేదు. పైగా ప్రస్ను ఎదుర్కొంటున్న సమస్య కొత్తది కాదు. అసాధారణమైనది కాదు. ఇటీవలె బ్లాగర్లందరూ ఓ చోట సమావేశమైతే, ఆ ఫోటోలు నెట్‌లో పెట్టొద్దని, పెట్టినా పేర్లు రాయొద్దనీ బోలెడంత టెన్షన్ పోయారు మహిళా బ్లాగర్లు. అలాంటి పరిస్థితిలో తన బొమ్మ పెట్టి, చాటింగ్ చేస్తూ, వాడు తన ఫోటోని ముద్దుపెట్టుకుంటున్నా, వ్యతిరేకించక, ప్రతిఘటించక, మనసులో మాట నిర్మొహమాటంగా చెప్పక, వాడికి మేధావి కళ ఉందని పొగుడుతూ, తనకి పెళ్ళయిందని, భర్తతో ఫోటోల్ని చూపుతూ, అయినా అర్థం చేసుకోవటం లేదని వాపోవటంతో కథ అర్థం లేనిదిగా, పాత్ర వ్యక్తిత్వం లేనిదిగా తయారయింది. ఏదో మగవాడి లైంగిక బుద్ధిని తిట్టటం తప్ప మరో ఉద్దేశ్యం లేదు రచయిత్రికి అనిపిస్తుంది కథ. పైగా, కథ చదువుతూ, దాన్లో ప్రస్ను పాత్ర ప్రవర్తన చూస్తుంటే, కాళిదాసు రచించిన శృంగార తిలకంలోని ఓ శ్లోకార్థం గుర్తుకు వస్తుంది. ఆశ్రయమివ్వమని ఇంటికి వచ్చిన ఓ యువకుడితో, యువతి 'నా భర్త వ్యాపార నిమిత్తం విదేశాలు వెళ్ళాడు. అత్తగారు ఇంట్లోలేరు. నేను యవ్వనంలో ఉన్నాను. ఒంటరిని. ఒంటరి దాన్ని నీకు ఆశ్రయం ఎలా ఇస్తాను? కానీ ఆ లేఖని పంపేయటం ఎలా?' అంటుందా యువతి. ఇది ఆహ్వానిస్తున్నట్టా? పొమ్మంటున్నట్టా? అలా ఉందీ కథ.

*దొంగతనం:* మధురాంతకం నరేంద్ర రచించిన ఈ కథ జూలై 5, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. ఇది మనకు పరిచయంలేని సామాజికాంశాన్ని ప్రతిభావంతంగా స్పృశిస్తుంది. సాధారణంగా, ఇళ్ళు కట్టే పనిచేసే మేస్త్రీలు పనిపిల్లలను కొనితెచ్చుకుంటారు. వాళ్ళు ఇళ్ళ వాళ్ళకు డబ్బులిచ్చి ఓ సంవత్సరంపాటు వీరితో పనులు చేయించుకుంటారు. ఓ రకమైన వెట్టిచాకిరీ, దోపిడి ఇది. మన కథకులు ఎంతో అరుదుగా స్పృశిస్తారీ అంశాన్ని. ఈ ఇంట్లో ఇలా పెయింటింగ్ పనులు చేసే అబ్బాయి పారిపోతాడు. వాడు ఇంట్లో వస్తువులు దొంగతనం చేశాడని ఇంట్లోవాళ్ళు ఆరోపిస్తారు. వాళ్ళలాంటివాళ్ళు కాదని మేస్త్రి అంటాడు. ఇదీకథ. చివరికి ఆ పిల్లవాడు దొరుకుతాడు. వాడో బక్కెట్టు తీసుకుపోతాడు. ఈ మధ్యలో సంభాషణల ద్వారా, వాదోపవాదాల ద్వారా ఇలాంటి పనివారి పరిస్థితులు పాఠకుడికి తెలుస్తాయి. అయితే, ఇక్కడా పాఠకుడికి ఏ పాత్రపై సానుభూతి కలగదు. కథలో పాఠకుడు తాదాత్మ్యం చెందడు. ఒక మంచి అంశాన్ని స్పృశించిన మామూలు కథలా మిగిలిపోతుంది కథ.

*పర్దా:* జూలై పంతొమ్మిది ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమైన ఈ కథను రచించింది వేంపల్లె షరీఫ్. ఈ కథకూడా మనకు అంతగా పరిచయం లేని జీవనాన్ని స్పృశిస్తుంది. కానీ కథ చదువుతున్న కొద్దీ పాఠకుడికి తాను ముస్లిమ్ల ఇళ్ళల్లోకి కాదు, తనలోకి తాను తొంగి చూసుకుంటునాడన్న భావన కలుగుతుంది. కథను పిల్లవాడి దృక్కోణంలో చెపుతాడు రచయిత. పిల్లవాడి నానమ్మ 'జేజి' వీళ్ళ దగ్గర ఉండటానికి వస్తుంది. ఆమెది స్వేచ్ఛ ప్రవృత్తి. కానీ ఆమె కొడుకు బయట తిరగవద్దంటాడు. పరదా

కదల్చద్దంటాడు. కానీ జేజి కదలకుండా ఉండలేదు. గతంలో పిల్లవాడిని ఎలా పెంచిందో గుర్తుచేస్తుకుంటుంది. ఆమెకు ఆరోగ్యం బాగాలేక పోతే డాక్టర్ దగ్గరకు వెళితే కొడుక్కు కోపమొస్తుంది. 'ఇంట్లో' పడి ఉండమంటాడు. 'వీడి సిన్నప్పుడు ఇల్లిల్లూ తిరిగి అడుక్కున్నా... అప్పుడు గోషా, పరదా అనుకుంటే ఈనాకొడుకు ఇంతోడు అయేటోడా' అంటూ వెళ్ళిపోతుంది. కథ చదువుతుంటే, మనకు తెలియకుండానే భుజాలు తడుముకుంటాం. మనలోపలికి తొంగి చూసుకుంటాం. ఆమె బయటకెళ్ళి పని చేయందే గడవని కుటుంబంలో పెరిగి కూడా పెద్దయిన తరువాత 'పర్దా' పాటించాలని నిర్బంధించే పురుషమనస్తత్వానికి మతంతో సంబంధం లేదు. ఈ కథలో ప్రదర్శించిన అంశాలు ప్రతి కుటుంబంలో ఏదో ఓ రూపంలో కనిపిస్తాయి. మంచి కథ ఇది. అత్త, కోడలు, కొడుకుల నడుమ ఘర్షణలు, ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రయత్నాలు చేయక అహానికే ప్రాధాన్యం ఇవ్వటం వంటి విషయాలను రచయిత చక్కగా ప్రదర్శించాడు.

*__కోల్పోయాక:__* డా.ఎ.రవీంద్రబాబు రచించిన ఈ కథ జూలై పంతొమ్మిది సాక్షి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. 'ఇలా ఎందుకు జరుగుతుంది? మా సంస్కృతి ఏమైంది? నా మూలాలు ఏమయ్యాయి? ఇదంతా ఎక్కడిది? ఎందుకు నేను నేనుకాదు?' అంటూ ఆరంభమవుతుందీ కథ. ఇదంతా గంగ ఆలోచన. గంగ తండ్రి తప్పెటలో ప్రసిద్ధుడు. ఆమెకు బాల్యంలో ఓ సందేహం వస్తుంది. తాము మొక్కేది అంకమ్మను. మరి ఈ విష్ణువు ఎవరు!? అని. ఆమె తండ్రి 'అవన్నీ పెద్దోళ్ళు రాసినవి' అంటాడు. తరువాత గంగ పెద్ద చదువులు చదివి 'వాస్తవ జీవితానికి తనే దూరమౌతుంది. పెళ్ళి చేసుకుంటుంది. నాన్నని పట్నం రప్పించుకుంటుంది. పిల్లలు టీవీలో 'షో చూస్తుంటారు' తాత తప్పెట ప్రోగ్రాం పెట్టాలంటే, 'ఛానల్ రేటింగ్స్' పడిపోతాయని ఎవరూ ఇవ్వరని బాధపడుతుంది. చివరికి 'ఒకప్పుడు తన సంస్కృతిపై అగ్రకులాల సంస్కృతి.. ఇప్పుడు అన్ని వర్గాల సంస్కృతిపై అగ్రరాజ్యాల సంస్కృతి దాడి' అంటు వాపోతుంది. ఇదీ కథ. కథలో 'గంగ' పాత్ర ఆవేదన అర్థమయినా, ఆ ఆవేదన స్వరూపాన్ని అవగతం చేసుకోవటంలో రచయిత మన సమాజంలో నెలకొని ఉన్న అపోహలను దాటి చూడలేకపోయాడు. ప్రచారంలో ఉన్న పాపులర్ భావాలనే ప్రదర్శించాడు. ఏ సమాజమైనా నిశ్చలంగా ఉంటే అది నశిస్తుంది. సమాజంలో నిరంతరం మార్పులు వస్తుంటాయి. ఈ మార్పులకు తట్టుకోగలవి నిలబడతాయి. లేనివి అదృశ్యమౌతాయి. అంకమ్మ, విష్ణువు వేర్వేరన్న భావన ఎదిగీ ఎదగని వయసులో వచ్చే భావన. కానీ ఏదో, ఒక్కసారి మనజీవన విధానాన్ని గమనిస్తే, మన దేవీ దేవతలంతా ఒకటేనని స్పష్టమౌతుంది. మన సమాజంలో సంఘర్షణలు ఇటీవలివేనని, ప్రాచీన కాలంలో అందరూ 'సహజీవనం' సాగించేవారనీ అర్థమౌతుంది. 'తన సంస్కృతిపై అగ్రకులాల సంస్కృతి దాడి' అన్న వాక్యం అర్థరహితమే కాక అవగాహనారాహిత్యానికి దర్పణం పడుతుంది. 'తమది' అదృశ్యం అవుతుందన్న ఆవేదన సమంజసమే అయినా, దానికి ఎవరినో దోషిని చేసి, ద్వేషం వెదజల్లటం భావ్యం కాదు. కథలో తప్పెట వాయిద్యాన్ని ఏ టీవీ ఛానల్ ప్రసారం చేయదని గంగవాపోతుంది. కానీ, తన తప్పెట వాయిద్యాన్ని సజీవంగా ఉంచేందుకు గంగకానీ గంగలాంటి విద్యావంతులు కానీ ఎలాంటి ప్రయత్నాలు చేయకుండా, ఎవరో దాడిచేస్తున్నారు, అన్యాయం చేస్తున్నారు అని వాపోవటం మన సమాజంలో నెలకొని ఉన్న 'పొలిటికల్లీ కరెక్టు' ఆలోచనలను అనుసరిస్తుంది. అయితే, రచయిత ఓ విషయం గమనించినట్టు లేదు. దూరదర్శన్ ఇప్పటికే అనేక మరుగున పడుతున్న జానపద కళలకు ప్రాధాన్యం ఇస్తుంది. టి.ఆర్.పితో సంబంధం లేకుండా వాటిని ప్రసారం చేస్తుంది. అలాగే, 'మా' టీవీలో 'రేలా రే రేలా' అన్న కార్యక్రమం పూర్తిగా జానపద పాటలదే అత్యంత ప్రాచుర్యం పొందిన కార్యక్రమం ఇది. పూర్తిగా జానపద పాటలదే అత్యంత ప్రాచుర్యం పొందిన కార్యక్రమం ఇది. జానపద పాటల వ్యాపారాల విలువను నిరూపించిన కార్యక్రమం ఇది.

*__వెంటాడే జ్ఞాపకం :__* జీవన్ రచించిన ఈ కథ జూలై 26 , 'ఆంధ్రభూమి' సంచికలో ప్రచురితమయింది. మనం సాధారణంగా చూసే దృశ్యాలను, గమనించే విషయాలనే మనసుతో చూసి ప్రదర్శించిన కథ ఇది. కథ ఓ ముసలాయన దృక్కోణంలో చెపుతాడు రచయిత. అతడు తన మనమరాలుని చూసి వెనక్కు వెళుతుంటాడు. రైల్లో ఎదురుగా పేద అమ్మాయి, పిల్లడితో ప్రయాణిస్తుంటుంది.

పిల్లాడు ప్రతి తను బండారాన్ని ఆశగా చుస్తుంటాడు. అది చూసిన ముసలాయన ఆ పిల్లవాడికి బిస్కెట్ కొనివ్వబోతే ఆమె వద్దంటుంది. 'ఎన్ని కష్టాలొచ్చిన గాని ఒకళ్ళ దగ్గర చెయ్యిసాచొద్దం'టుంది. ఆమె భర్త చనిపోతే, పనివెతుక్కునేందుకు అన్న దగ్గరకు వెళుతుంటుంది. ఇదీ కథ. ఈ కథలో ఒకరికి తిండి ఎక్కువ అవటం, మరొకరికి తిండిలేకపోవటం, తినాలని ఉన్నా తినలేని పేదపిల్లలు, అన్ని ఉన్నా తినలేని ధనవంతులు, ఆత్మాభిమానం, ఆత్మగౌరవం వంటి విషయాలను రచయిత చక్కగా ప్రదర్శించారు. అయితే కథ ఆరంభం సుదీర్ఘంగా ఉండి, కాస్త విసుగు కలిగిస్తుంది. దాదపుగా ఈ కథను ఈ నెల కథగా ఎంచుకోవాలనుకుని నిశ్చయించుకుంటుంటే ఈ క్రింది కథ కళ్ళబడ్డది.

*__మనకోసం ఆకాశం:__* ఎన్ శివనాగేశవరరావు రచించిన ఈ కథ జూలై 2, ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురితమయింది. ఈనెల కథ ఇది. ఈనెల కథగా ఎంచుకోవటంలో ప్రధాన పాత్ర వహించింది, కథలో రచయిత ప్రదర్శించినది పాజిటివ్ దృక్పథం. శంకరం తండ్రి కృష్ణమూర్తి రిటైరవుతాడు. ఆయన వైద్యుడు. రిటైరయినా, అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుండా వచ్చినవారికి మందులిస్తుంటాడు. ప్రొద్దున్నే అందరికీ యోగా నేర్పిస్తుంటాడు. ఇది శంకరానికి నచ్చదు. విసుక్కుంటుంటాడు. విసుక్కుంటూ, తన బ్రతుకేదో తాను బ్రతకాలనుకునే శంకరానికి 'మొక్కను తెచ్చి గదిలో పెడితే వాడిపోతుంది. బయట పెడితే చిగురిస్తుంది. దానికి జీవంపోసేది సూర్యకిరణం. ఇదే సూత్రం మనిషికీ వర్తిస్తుంది. ఒంటరిగా గదిలో కూర్చుంటే మనసు చచ్చిపోతుంది' అని పదిమందితో కలిసి మెలసి ఉండాలని, ప్రేమ చూపాలని బోధిస్తాడు. ఓ రోజు హఠాత్తుగా కృష్ణమూర్తి మరణిస్తాడు. అప్పుడు అర్ధమౌతుంది శంకరానికి, తన తండ్రి ఇంతమంది జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపించాడో. 'మనకోసం అవకాశం బయట వేచి చూస్తున్నది. ఇంటి తలుపు ముందు, మనసు తలుపులు కూడా తీసుకుని బయటకు రావాలి' అన్న తండ్రిమాటల మర్మం బోధపడుతుంది. చక్కని కథ ఇది. సంకుచితంతో, తాను, తనదీ అన్నదానికి పరిమితమవటంలోని అనర్ధాన్ని చక్కగా ఎత్తి చూపిస్తుంది. మంచి ఆదర్శాన్నిస్తుంది. పది వ్యక్తిత్వ వికాస వ్యాసాలు చూపలేని ప్రభావాన్ని ఒక మంచి కథ సాధిస్తుందనటానికి ఈ కథ నిదర్శనం. ఎలాంటి ద్వేషాలు, ఆవేదనలు, ఆవేశాలు, సంఘర్షణలు, ఉద్యమాలతో ప్రమేయం లేకుండా మానవ జీవితానికి ఆవశ్యకమైన ఒక మంచి ఆలోచనను ప్రదర్శించిన ఈ కథ ఈ నెల కథ.

ఈ కథ చదివిన తరువాత ఆగస్ట్ (2009) నెల రీడర్స్ డైజెస్ట్‌లో మాళవిక శ్రీవాస్తవ రాసిన ఆమె తండ్రి స్మృతులు 'My Fathers Secrets' కూడా చదవండి. నిజజీవితంలోంచి వచ్చే కథల గొప్పతనం స్పష్టమౌతుంది. ఉద్యమాలు, సమస్యలు ప్రదర్శించే కథలకన్నా మానవ జీవితంలోని మంచిని ప్రదర్శించే కథల ఔన్నత్యం, ఆవశ్యకతలు స్పష్టమౌతాయి.

*ఈనెల కథ*

## మనకోసం ఆకాశం - ఎన్.శివనాగేశ్వరరావ్.

2 జూలై, ఆంధ్రభూమి , వారపత్రిక 2009 సంచిక నుంచి

అప్పుడే నిద్రపడుతున్న శంకరానికి నిద్రాభంగం అయింది.

తలతిప్పి గడియారం వంక చూశాడు. సమయం పదకొండు అయింది. "ఈ సమయంలో వచ్చింది ఎవరా? అని ఆలోచించలేదతను. వచ్చింది నాన్నకోసమే!" అని మాత్రం అనుకున్నాడు.

అంతలో పక్క గది తలుపు తెరుచుకుంది. "నువ్వా రమణయ్యా! ఈ సమయంలో వచ్చావు. మందేమైనా కావాలా?" అని తండ్రి అడగడం శంకరానికి వినిపిస్తూనే ఉంది.

"ఉన్నట్లుండి ఆయాసం వచ్చిపడింది. ఊపిరి సలపడంలేదు. అందుకే ఈ సమయంలో వచ్చాను. ఏమీ అనుకోకు క్రిష్ణమూర్తీ!" అన్నాడు రమణయ్య.

"మరేం ఫర్వాలేదు. అలా కూర్చో! మందు ఇస్తాను" అన్నాడు క్రిష్ణమూర్తి.

అతనిచ్చిన మందు వేసుకుని అయిదు నిముషాల తరువాత వెళ్ళిపోయాడు రమణయ్య. క్రిష్ణమూర్తి బయట గేటు వేసి వచ్చి మంచం మీద నడుము వాల్చాడు.

నిద్రాభంగం అయిన శంకరానికి మరిక నిద్రపట్టలేదు. అందుకు కారకుడైన తండ్రి మీద పీకలదాకా కోపం వచ్చింది. అది వెంటనే వెళ్ళగక్కపోతే మరిక నిద్రపట్టదని నిశ్చయం అయ్యాక మంచం మీద నుంచి లేచి తండ్రి గదిలోకి వెళ్ళాడు.

"ఏం శంకరం! నిద్రపట్టలేదా?" పలకరించాడు క్రిష్ణమూర్తి.

"పట్టిన నిద్ర నీవలన పాడైంది. అయినా మందులు ఇవ్వడానికి వేళాపాళా లేదా? ఎప్పుడు పడితే అప్పుడు రావద్దని వాళ్ళకు చెప్పు" అన్నాడు విసుగ్గా.

"వచ్చే రోగం వేళాపాళా చూసుకుని వస్తుందా? ఏదో చేతనైన సహాయం చేస్తున్నాను. కోపగించకు" అన్నాడు క్రిష్ణమూర్తి.

"నీ మటుకు నీ ఉండక ఎందుకొచ్చిన సహాయాలు? ఇంటిని సత్రం చేస్తున్నావు. ఎప్పుడూ ఎవడో ఒకడు వస్తూనే ఉంటాడు" చికాకు పడుతూ తనగదిలోకి వెళ్ళిపోయాడు శంకరం.

కొడుకు మాటలకు క్రిష్ణమూర్తి మనసు చివుక్కుమంది. అది అతనికి కొత్తకాదు. అయినా ప్రతిసారీ బాధనిపిస్తూనే ఉంటుంది. 'ప్రక్కవాడికి సహాయం చేయకపోతే మరెవరు చేస్తారు? ఎవరి మటుకు వాళ్ళుంటే ప్రపంచం ఎలా నడుస్తుంది? ' అనుకున్నాడు మనసులో.

మనిషి పదిమందితోనూ కలవాలి. తనకు తానుగా ఉంటే కుంచించుకుపోతాడు. పదిమందికి సహాయం చేస్తే పరిమళిస్తాడు అన్నది అతని భావన. అతను అలాగే ఉంటాడు. అందరూ అలా ఉండాలనుకుంటాడు.

శంకరానికి నిద్రపట్టలేదు. తండ్రితో అంత కటువుగా మాట్లాడకుండా ఉండవలసింది అనుకున్నాడు.

శంకరానికి పదేళ్ళ వయసు వచ్చేసరికి అతని తల్లి కాలం చేసింది. ఎంతమంది ఎన్ని విధాలుగా చెప్పినా క్రిష్ణమూర్తి మరలా రెండో పెళ్ళి చేసుకోలేదు. శంకరాన్ని ఎంతో ప్రేమగా పెంచి పెద్దచేశాడు. ఆ అభిమానం శంకరానికి లేకపోలేదు. వద్దనుకుంటూనే తండ్రిమీద కోపగించుకుంటూ ఉంటాడు. తలతిప్పి చూసిన శంకరానికి భార్య ఇందిర, అయిదేళ్ళ కొడుకు అనిల్ నిద్రపోతూ కనిపించారు. గంటకు గాని శంకరానికి కంటిమీద కునుకు రాలేదు.

తెలతెలవారుతుండగా బయట గేటు తీసిన చప్పుడయింది. శంకరానికి వెంటనే మెలుకువ వచ్చింది. 'ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. అప్పుడే తగలడ్డారు' అని మనసులో తిట్టుకున్నాడు.

క్రిష్ణమూర్తికి యోగాలో మంచి ప్రవేశముంది. రిటైరయ్యాక నలుగురిని పిలిచి ఆసనాలు వేయించడం, ధ్యానం చేయించడం వంటివి నేర్పించడం మొదలుపెట్టాడు. ఎప్పుడూ పదిమందికి తక్కువ కాకుండా జనం అతని దగ్గరకు వస్తూనే ఉంటారు.

అది శంకరానికి నచ్చదు. ఎవరింటి దగ్గర వాళ్ళు యోగా చేసుకోవచ్చుకదా! మా ఇంటి మీదకు వచ్చిపడతారెందుకు? అనుకుంటాడు. అదే విషయం తండ్రితో వాదించాడు కూడా.

"ఎవరింటి దగ్గర వాళ్ళుంటే బద్ధకిస్తారు. అందరూ ఒక చోట కలిస్తే శ్రద్ధ పెరుగుతుంది. మనిషి పదిమందితో కలిస్తే చాలా ప్రయోజనాలుంటాయి. నీవు కూడా వచ్చి వాళ్ళతోపాటు యోగా చెయ్యి. ఆరోగ్యానికి ఆరోగ్యం. మానవ సంబంధాలు మెరుగుపడతాయి" అని చెప్పేవాడు. క్రిష్ణమూర్తి. ఆ మాటలు శంకరానికి రుచించేవి కావు.

సమయం అయిదు గంటలు అయింది. శంకరం మరలా నిద్రపోవడానికి ప్రయత్నించాడు గానీ నిద్రపట్టలేదు. అతనికి త్వరగా నిద్రపట్టదు. పట్టినా చిన్న చప్పుడుకే మెలుకువ వచ్చేస్తుంది.

అది తెలుసుకున్న క్రిష్ణమూర్తి ఒకసారి 'శంకరం! నీవు ఇష్టపడే ఒంటరితనం నీలో అభద్రతా భావం పెంచింది. నీ సంతోషం హరిస్తున్నది. అది నీవు గ్రహించడంలేదు. నీ మటుకు నీవుంటే నీ సంతోషం నీది. నీ దుఃఖం నీది. బయటకి వచ్చి పదిమందితో పంచుకుంటే నీ సంతోషం మరింత పెరుగుతుంది. దుఃఖం తగ్గుతుంది" అని సలహా ఇచ్చాడు. తండ్రి మాటలు ఛాదస్తంగా కొట్టిపారేశాడు శంకరం.

ఏడుగంటలకు యోగా క్లాస్ పూర్తయింది. వచ్చిన వాళ్ళు వెళ్ళిపోయారు. క్రిష్ణమూర్తి డాబా మీద నుంచి కిందకు దిగాడు. అప్పటికి శంకరం కాఫీ తాగి పేపర్ చదువుకుంటున్నాడు.

"కొంచెం సేపు ధ్యానం చేయకూడదూ? ఏకాగ్రత పెరుగుతుంది" అన్నాడు క్రిష్ణమూర్తి. శంకరం పేపర్‌లోంచి తలెత్తకుండానే "అవన్నీ పనీపాటా లేనివారికి. నాకెందుకు"అన్నాడు

క్రిష్ణమూర్తి మౌనంగా లోనికి నడిచి అప్పుడే నిద్రలేచిన మనవడ్ని పలకరించి వాడితో సూర్యనమస్కారాలు ప్రాక్టీస్ చేయించసాగాడు. అది చూసిన శంకరం "ఈయనగారు ఎవరినీ వదలడు" అనుకున్నాడు.

శంకరం స్నానం చేసి, టిఫిన్ తిని ఆఫీస్‌కి బయలుదేరపోతుండగా క్రిష్ణమూర్తి అతని దగ్గరకు వచ్చాడు.

"ఏమిటి?" అడిగాడు శంకరం.

అతను, శంకరానికి అయిదువందలు అందించి "ఈ చిరునామాకి మని ఆర్డర్ పంపించు" అని చెప్పాడు.

"ఎందుకట?" వివరం అడిగాడు శంకరం.

"ఆ అబ్బాయికి చిన్నవయసులోనే గుండెజబ్బు. ఆపరేషన్‌కి ఆర్థిక సహాయం కోరుతూ పేపర్ ప్రకటన ఇచ్చారు. నేను చేయగల సహాయం చేస్తున్నాను" చెప్పాడు క్రిష్ణమూర్తి.

"అవన్నీ దొంగప్రకటనలు" చెప్పాడు శంకరం.

"మనిషి మీద అంత అపనమ్మకం పెంచుకోకు శంకరం! మనిషిని నమ్మకపోతే అది మానవ మనుగడనే దెబ్బతీస్తుంది" కొడుకును హెచ్చరించాడు క్రిష్ణమూర్తి.

అంతలో అటు వచ్చిన ఇందిర, భర్తతో 'మామయ్య పెన్షన్ డబ్బులు ఆయన ఇష్టం వచ్చినట్టు ఖర్చుపెట్టుకోమని మీరే కదా చెప్పారు! ఇప్పుడు వాదన ఎందుకు? మామయ్యగారు చెప్పినట్లు చేయండి' అన్నది. క్రిష్ణమూర్తి కోడలి వంక ప్రేమపూర్వకంగా చూశాడు.

శంకరం స్కూటర్ స్టార్ట్ చేస్తూ "అనిల్‌ని ఒకసారి బయటకు పిలువు" అని భార్యతో చెప్పాడు.

"అనిల్! డాడీ పిలుస్తున్నారు!" కేక వేసింది ఇందిర.

వీడియో గేమ్ ఆడుకుంటున్న అనిల్ బయటకు రాకుండానే "బైడాడీ!" అని బిగ్గరగా అరిచాడు. కొడుకు బయటకు రాకపోవడం శంకరానికి అసంతృప్తిని కలిగించింది. ఆఫీస్‌కి బయలుదేరిపోయాడు.

మనవడు బయటకు రాకుండానే 'బై' చెప్పడం గమనించిన క్రిష్ణమూర్తి "మనిషి మనసుతో చేయవలసిన పనులు కొన్ని ఉన్నాయి. కానీ ఇప్పుడు అవన్నీ యాంత్రికం అయిపోతున్నాయి. కొంతకాలానికి మనిషి, మనసులేని మరబొమ్మ అయిపోతాడు" అనుకున్నాడు.

అతను మనవడి దగ్గరకు వెళ్ళి "అనిల్! నాన్న పిలిచినప్పుడు బయటకు వెళ్ళి ప్రేమగా టాటా చెప్పాలి. అప్పుడతని మనసుకు సంతోషం కలుగుతుంది. వీడియో గేం ఎప్పుడూ ఉంటుంది. డాడీ మళ్ళీ సాయింత్రానికి గాని రాడు" అని చెప్పాడు.

"అలాగే తాతయ్యా! రేపటినుంచి బయటకు వెళ్ళి డాడీకి బై చెపుతాను" అన్నాడు అనిల్.

"కొడుకు కంటే మనవడే నయం. విషయం గ్రహించాడు" అనుకున్నాడు క్రిష్ణమూర్తి.

ఆయనకు భోజనం వడ్డించే సమయంలో "మామయ్యా! ఎల్లుండి అనిల్ పుట్టినరోజు. యోగా వాళ్ళను పిలుద్దాం" అన్నది ఇందిర. అతను కోడలు వంక అపురూపంగా చూశాడు. అతనికి శంకరం ఒక్కడే కొడుకు. కూతుళ్ళు లేరు. అందుకని అతను కోడలులోనే కూతురిని చూసుకుంటాడు. ఆ అమ్మాయీ మామగారిని పన్నెత్తి మాట అనదు. గౌరవం చూపిస్తుంది. ప్రేమ కురిపిస్తుంది.

"వాళ్ళను పిలవడం శంకరానికి ఇష్టం ఉండదేమో!" అన్నాడు క్రిష్ణమూర్తి.

"ఆయన ఎవరినీ పిలవొద్దనే అన్నారు. అయినా రోజూ మన ఇంటికి వచ్చేవాళ్ళకు చెప్పకపోతే ఏం బాగుంటుంది? మీరు ఆహ్వానించండి. మీ అబ్బాయికి నేను నచ్చచెపుతానులెండి" అన్నది ఇందిర.

"అలాగేనమ్మా!" అన్నాడు క్రిష్ణమూర్తి.

ఆ సాయంత్రం శంకరం ఇంటికి వచ్చాక "మని ఆర్డరు పంపావా?" అని అడిగాడు క్రిష్ణమూర్తి.

"పంపాను. అది చూసి కొలీగ్ నవ్వాడు?" చెప్పాడు శంకరం.

"ఎందుకు నవ్వాడు?" అడిగాడు మూర్తి.

"తనకి ఉన్నదేదో మనవలకివ్వాలిగానీ, ఎవరికో దానం చేయటం ఏమిటి?" అని కామెంట్ చేశాడని చెప్పాడు శంకరం.

"నువ్వేమన్నావు?" ఆరా తీశాడు క్రిష్ణమూర్తి.

"అది నిజమే కదా అందుకే మౌనం వహించాను" చెప్పాడు శంకరం.

"మనవాళ్ళకే ఉపయోగపడాలనుకోవడం స్వార్ధం అవుతుంది. అందరూ మనవాళ్ళే అనుకోవడం ప్రేమ అనిపించుకుంటుంది. మనిషి ప్రేమించడం నేర్చుకోవాలని నీ కొలీగ్‌కి చెప్పు" అన్నాడు క్రిష్ణమూర్తి. శంకరం తండ్రి వంక విసుగ్గా చూసి ఊరుకున్నాడు.

శంకరం కాఫీ తాగుతుండగా "అనిల్ బర్త్‌డేకి యోగా వాళ్ళను పిలవమని మామయ్యకు చెప్పాను" అంది ఇందిర.

"నేననుకోవడం ఈ ఆలోచన నీది కాదు. మా నాన్నది" అన్నాడు శంకరం. ఇందిర కాదని చెప్పినా శంకరం వినిపించుకోలేదు.

కాఫీ తాగడం పూర్తయ్యాక తండ్రి దగ్గరకు వెళ్ళాడు. ఆ సమయంలో క్రిష్ణమూర్తి మొక్కలకు నీళ్ళు పోస్తున్నాడు.

"బాబు బర్త్‌డేకి యోగావాళ్ళను పిలుస్తానన్నావట. వాళ్ళు రావడం నాకిష్టం లేదు" చెప్పాడు శంకరం.

"అయితే మీ ఆఫీస్ స్టాఫ్‌ని పిలువు. పుట్టిన రోజునాడూ పదిమంది వచ్చిబాబు మీద అక్షింతలు వేసి దీవిస్తే మంచిది" చెప్పాడు క్రిష్ణమూర్తి.

"మా వాళ్ళు బిజీ. రాలేరు" చెప్పాడు శంకరం.

"ఇంటో టీవీ చూస్తూ కూర్చోవడం, ప్రక్కింటివాళ్ళతో కూడా సెల్‌ఫోన్‌లో మాట్లాడడం - ఇదేగా మీ దృష్టిలో బిజీగా ఉండడం" ప్రశ్నించాడు క్రిష్ణమూర్తి.

"అదేం కాదు. పిల్లల్ని కష్టపడి చదివించడం, టాలెంట్ పరీక్షలు రాయించడం వంటి పనుల్లో వాళ్ళు బిజీ" చెప్పాడు శంకరం.

"పిల్లల మనసుల్ని చదువుల పేరుతో మీరు ఎదగనివ్వడం లేదు. మొగ్గలుగా ఉండగానే తుంచేస్తున్నారు. మానవ సంబంధాలు దెబ్బతినడానికి ఇదీ ఒక కారణం" అన్నాడు క్రిష్ణమూర్తి.

అంతలో అక్కడకు వచ్చిన ఇందిర, భర్తతో "రోజూ మనింటికి వస్తున్నా ఏనాడూ మనం యోగా వాళ్ళకు కాఫీ కూడా ఇవ్వలేదు. ఒకసారి పిలిచి పలకరిస్తే మర్యాదగా ఉంటుంది" అని సలహా ఇచ్చింది. శంకరం భార్య వంక గుర్రుగా చూశాడు.

ఆ రాత్రి క్రిష్ణమూర్తికి చాలాసేపు నిద్రపట్టలేదు. అతను తరిగిపోతున్న మానవ సంబంధాల గురించి ఆలోచించాడు. 'యంత్రాల మధ్య పడి మనిషి కూడా ఒక యంత్రంగా మారిపోతున్నాడు. మనిషికి మనసే తరగని ఆస్తి అన్న సత్యం మరచి పతనాన్ని కొనితెచ్చుకుంటున్నాడు" అని ఆలోచించాడు.

అనిల్ పుట్టినరోజు వచ్చింది. ఆ రోజు సాయంత్రం క్రిష్ణమూర్తి పిలుపు అందుకున్న యోగా బృందం వాళ్ళింటికి వచ్చింది. బాబుకి నీతి కథల పుస్తకాలు, ఆటబొమ్మలు తెచ్చిచ్చారు. తాము తెచ్చిన స్వీట్స్ బాబు చేత తినిపించారు. అక్షింతలు వేసి దీవించారు. పాటలు పాడి అనిల్‌ని ఆనందపరిచారు. వాడిచేత ఆడించారు, పాడించారు. శంకరంతో కూడా కలుపుగోలుగా మాట్లాడారు.

ఎందుకో తెలియదుగానీ శంకరానికి ఆ సాయంత్రం ఆనందంగా గడిచిందనిపించింది. వాళ్ళు వచ్చి ఉండకపోతే ఆ వేడుకకు అంత నిండుదనం వచ్చి ఉండేది కాదనుకున్నాడు.

వాళ్ళందరూ వెళ్ళాక క్రిష్ణమూర్తి, కొడుకుతో "మా వాళ్ళు రావడం నీకేమైనా ఇబ్బందిగా అనిపించిందా?" అని అడిగాడు.

"అటువంటిదేం లేదు. సంతోషంగానే అనిపించింది" మనస్ఫూర్తిగా చెప్పాడు శంకరం.

"శంకరం! ఒక సత్యం చెబుతాను. నాది చాదస్తంగా భావించకుండా మనసు పెట్టి ఆలోచించు. మొక్కను తెచ్చి గదిలో పెడితే వాడిపోతుంది. బయట పెడితే చిగురిస్తుంది. దానికి జీవం పోసేది సూర్యకిరణం. ఇదే సూత్రం మనిషికీ వర్తిస్తుంది. ఒంటరిగా గదిలో కూర్చుంటే మనసు చచ్చిపోతుంది. బయటకు వెళ్ళి పదిమందితో గడిపితే అది సేద తీరుతుంది. మనసుకు ప్రాణం పోసేది ప్రేమ అని మరువకు" అని చెప్పాడు క్రిష్ణమూర్తి. ఎప్పటిలా ఈసారి తండ్రి మాటలు శంకరం ఖండించలేదు. మౌనం వహించాడు.

ఆ రాత్రి క్రిష్ణమూర్తికి గుండెలో నొప్పిగా అనిపించింది. కొడుకును నిద్రలేపి విషయం చెప్పాడు. ఎప్పుడూ ఏ నొప్పీ అనని తండ్రి ఒకేసారి గుండె నొప్పి అనగానే శంకరం కంగారు పడ్డాడు.

"హాస్పిటల్‌కి వెళదాం" అన్నాడు.

"ఉదయం వెళదాం" అంటూ క్రిష్ణమూర్తి హోమియో మందులువేసుకుని కళ్ళు మూసుకుపడుకున్నాడు. శంకరం తండ్రి మంచం పక్కనే పడక కుర్చీ వేసుకుని కూర్చున్నాడు.

అర్ధరాత్రి చూస్తే తండ్రి ఊపిరి పీలుస్తున్నట్లు అనిపించలేదు. నాడి చూసిన శంకరం తండ్రి ప్రాణం పోయినట్లు గ్రహించి కంట తడిపెట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న ఇందిర, అనిల్ పెద్దగా ఏడవసాగారు.

బంధువులకు, స్నేహితులకు కబుర్లు అందాయి. మరునాటికి అందరూ వచ్చారు. అంత దుఃఖంలోనూ ఒకే విషయం శంకరాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. అతను కబురు చేసినవారికంటే వచ్చినవారు పదిరెట్లున్నారు.

ఇంటి ముందున్న రోడ్డంతా జనంతో నిండిపోయింది. అందరూ విషాద వదనాలతో కనిపించారు.

క్రిష్ణమూర్తి మంచితనం గురించి కథలు కథలుగా చెప్పుకోసాగారు.

"శంకరం! పూలదండలోని దారం బయటకు కనిపించదు. కానీ అది పూలనన్నింటినీ దగ్గరకు చేరుస్తుంది. ప్రేమ కూడా అంతే! అది బయటకు కనిపించదు. కానీ మనుషులందరినీ దగ్గరకు చేరుస్తుంది." అన్న తండ్రి మాటలు గుర్తుకొచ్చాయి శంకరానికి.

మధ్యాహ్నానికి శవయాత్ర మొదలైంది. పాడె మోయడానికి చాలామంది ముందుకొచ్చారు. భుజం మార్చుకుంటూ తమ అభిమానం చాటుకున్నారు. సాయంత్రానికి అంత్యక్రియలు కార్యక్రమం ముగిసింది.

ఆ తరువాత ప్రతీరోజు ఎవరో ఒకరు వచ్చి శంకరాన్ని కలిసి అతని తండ్రి మంచితనాన్ని పొగిడి, అతనికి ఓదార్పు మాటలు చెప్పేవారు. పెద్దకర్మ కూడా జరిగిపోయింది. ఇక అంతటితో అంతా ముగిసిపోయిందని ఇక ఎవరూ తమ ఇంటికి రారని ఊపిరిపీల్చుకున్నాడు శంకరం.

ఆ రాత్రి గాఢంగా నిద్రపోయాడు. తెలతెలవారుతుండగా మెలుకువ వచ్చింది. తండ్రి చనిపోయేవరకూ ప్రతి రోజూ ఆ సమయానికి బయట గేటు తెరుచుకునేది. డాబా మీద తండ్రి, వచ్చినవారితో కలసి ఆసనాలు వేసేవాడు. వాళ్ళమాటలు, చిన్న చిన్న శబ్దాలు లీలగా వినిపించేవి. అప్పట్లో వాళ్ళ వలన నిద్రపాడైందని తిట్టుకునేవాడు శంకరం. ఇప్పుడా నిశ్శబ్దం అతని మనసుకు బాధను కలిగించింది భోజనం చేసి ఆఫీసుకి బయలుదేరినప్పుడు పిలవకుండానే అనిల్ బయటకు వచ్చి టాటా చెప్పాడు.

"పిలిచినా రానివాడివి. ఈ రోజు పిలవకుండానే వచ్చి టాటా చెబుతున్నావు. ఏమిటి విశేషం?" అడిగాడు శంకరం.

"తాతయ్య చెప్పాడు, నేను బయటకు వచ్చి నీకు 'బై' చెబితే నీ మనసుకు సంతోషం కలుగుతుందట" చెప్పాడు అనిల్. శంకరం కళ్ళముందు తండ్రి రూపం కదలాడింది. మనసును ఎవరో మెల్లగా స్పృశించినట్లనిపించింది. కన్నుల్లో చెమ్మ చేరింది. కొడుక్కి 'బై' చెప్పి బయలుదేరిపోయాడు.

ఆ సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు కూరగాయల దుకాణానికి వెళ్ళాడు. అతను ఆప్యాయంగా పలకరించి "నాన్నగారు పోయారని తెలిసింది. ఊళ్ళో లేక రాలేక పోయాను. మహానుభావుడు. ఈ దుకాణం పెట్టుకోవడానికి బ్యాంకులోను ఇప్పించి సాయం చేశాడు. అతన్ని ఎప్పటికీ మరచిపోలేను" అని చెప్పాడు.

"నాన్న కనిపించకుండా ఎంతచేశాడు? " అనుకున్నాడు శంకరం.

నెలరోజుల తరువాత శంకరానికి ఒక విషయం అర్థమయింది. తను భావించినట్లు చనిపోవడంతో తండ్రి అధ్యాయం ముగిసిపోలేదు. ప్రతిరోజూ ఎవరో ఒకరు క్రిష్ణమూర్తి సహాయాన్ని, మంచితనాన్ని, ప్రేమను శంకరం దగ్గర గుర్తుచేసుకుంటూనే ఉన్నారు.

ఒకరోజు శంకరం టవల్స్ కొనడానికి బట్టల కొట్టుకు వెళ్ళాడు. అది పేరు మోసిన బట్టల దుకాణం. ఆ దుకాణం యజమాని శంకరాన్ని చూడగానే పలకరింపుగా నవ్వి "మీరు క్రిష్ణమూర్తిగారి అబ్బాయి కదూ!" అని కూర్చోబెట్టి మర్యాద చేశాడు.

"అప్పుడప్పుడూ మీ నాన్నగారు వచ్చి ఇక్కడ కూర్చునేవారు. ఒకసారి నిద్రపట్టక ఇబ్బంది పడుతున్నానని చెప్పాను. మానసిక అశాంతి వలన అయి ఉంటుంది. ధ్యానం చేయమని సలహా ఇచ్చారు. ధ్యానం ఎలా చేయాలో కూడా వివరించారు. అప్పటినుంచి ధ్యానం చేస్తున్నాను. మనసు చాలా ప్రశాంతంగా ఉంటున్నది. ఆయన చనిపోవడం దురదృష్టకరం" అని బాధపడ్డాడు దుకాణదారు.

తండ్రి ఎందరి మనసుల్లోనో నిలిచిపోయాడన్న సత్యం గ్రహించేసరికి శంకరానికి దిగులుగా అనిపించింది. అటువంటి తండ్రిని తను ఖాతరు చేసేవాడు కాదు. ప్రేమ చూపించేవాడు కాదు. ప్రతి చిన్న విషయానికీ తప్పుపట్టేవాడు. శంకరం మనసులో తీవ్రంగా బాధపడ్డాడు.

అతను ఇల్లు చేరగానే ఇందిర ఒక ఉత్తరం అందించింది. చనిపోయిన తండ్రి పేరున ఉన్నదా ఉత్తరం. శంకరం కవరు చింపి చదివాడు.

"శ్రీయుతులు క్రిష్ణమూర్తిగారికి నమస్సులు. మీ వంటి మంచి మనసున్నవారు పంపిన విరాళాలతో నాకు గుండె ఆపరేషన్ జరిగింది. ఇప్పుడు నేను కులాసాగా ఉన్నాను. మీరు పంపిన విరాళం చిన్న మొత్తమే కావచ్చు. కానీ అది కష్టకాలంలో నాకెంతో

ధైర్యాన్నిచ్చింది. నేను ఒంటరిని కాదు. నాకు తోడుగా చాలామంది ఉన్నారన్న ఆత్మసంతృప్తిని కలిగించింది. మీకు ధన్యవాదాలు.. ఇట్లు, గోపీచంద్" అని ఉందా ఉత్తరంలో.

శంకరం గోడకు తగిలించిన తండ్రి ఫోటో వంక చూశాడు. "శంకరం! మనిషి - నేను, నా కుటుంబం అన్న సంకుచితత్వం నుంచి బయటపడి మనం, మన వసుధైక కుటుంబం అన్న విశాల దృక్పథం అలవరచుకోవాలి" అని చెబుతున్నట్లు అనిపించింది.

ఆ రాత్రి శంకరానికి నిద్రకరువయింది. తనకు, తండ్రికి తేడా ఏమిటో అతను స్పష్టంగా గ్రహించగలిగాడు. తన తండ్రి మనసున్న మనిషి. తను మనసులేని మరబొమ్మ. తనకు జీవన సౌందర్యం తెలియదు. అదెలా ఉంటుందో తండ్రి తెలియబరిచాడు.

ఒక ఆదివారం అతను తన తండ్రి బ్రతికి ఉండగా యోగాసనాలు వేయడానికి తమ ఇంటికి వచ్చే ప్రతి ఒక్కరి ఇంటికి వెదుక్కుంటూ వెళ్ళాడు. "మా నాన్నగారు చనిపోయారని మీరు మా ఇంటికి రావడం మానుకోకండి. నేనూ మీతో కలుస్తాను. యోగాతో నాన్నగారికి అంజలి ఘటిద్దాం" అని ఆహ్వానించాడూ. అందుకు వారందరూ సంతోషంగా తమ సమ్మతి తెలిపారు.

మరునాడు తెలతెలవారుతుండగ శంకరం ఇంటి బయటి గేటు తెరిచాడు. వస్తున్నవారందరికీ హృదయపూర్వకంగా ఆహ్వానం పలికాడు. డాబా పైకి వెళ్ళి వాళ్ళతో పాటు ఆసనాలు వేశాడు. ఆ తరువాత ధ్యానంలో కూర్చున్నాడు.

మనసులో తండ్రి రూపం కనిపించింది. "శంకరం! మనిషి తలుపులు మూసుకుని ఒంటరిగా గదిలో ఉండిపోతున్నాడు. అది తప్పు. మనకోసం ఆకాశం బయట వేచి చూస్తున్నదని తెలుసుకోవాలి. ఇంటి తలుపులే కాదు, మనసు తలుపులు కూడా తీసుకుని బయటకు రావాలి. అప్పుడు ప్రపంచమే అతనిదవుతుంది" తండ్రి చెప్పిన మాటలు మనసులో ప్రతిధ్వనించాయి.

శంకరం కళ్ళు తెరిచాడు. గదిలో ఉంటే కనిపించని ఆకాశం ఇప్పుడతనికి ఎంతో అందంగా, విశాలంగా కనిపించింది. శంకరానికి మనసు కొత్త చిగురు తొడిగినట్లు అనిపించింది. తొలిసారి అతని మనసుకు ఎంతో సంతోషం, ప్రశాంతత కలిగాయి.

✷✷✷